**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

విజయవాడ,
**తేది : 23 సెప్టెంబర్, 2020.**

## డిస్కామ్‌ల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి

విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కామ్)ల ప్రయివేటీకరణ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ(యం) విజ్ఞప్తి చేస్తున్నది.

డిస్కామ్‌లను ప్రయివేటు బిడ్డర్లకు అప్పగించే విధి విధానాలను కేంద్ర విద్యుత్ శాఖ మంగళవారం నాడు వెల్లడించింది. దీంతో సంస్కరణల పేరిట ప్రజల సొమ్మును (డిస్కామ్‌లను) ప్రయివేటుకు కారుచౌకగా కట్టబెట్టాలన్న షరతులకు తలవంచే వైఖరి మానుకోవాలని, పేద, మధ్యతరగతి ప్రజలకు, రైతాంగానికి హానికరమైన కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరించాలని కోరుతున్నాం. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు, నగదు బదిలీ స్కీం పెట్టినప్పుడే డిస్కామ్‌లను ప్రయివేటుపరం చేయడానికేనని సిపిఐ(యం) చెప్పింది. అది ఇప్పుడు నిజమని రుజువైంది.

విద్యుత్ డిస్కామ్‌ల ఎక్విప్‌మెంటునంతటినీ ప్రయివేటు వారికి బదలాయించాలని, నామమాత్రపు రుసుము చెల్లించి ఆ భూములను వాడుకొనే హక్కు ప్రయివేటు వారికి కల్పించాలనీ కేంద్రం పేర్కొంది. ఇప్పటి వరకు పనిచేస్తున్న ఉద్యోగులను ప్రయివేటుకు బదలాయిస్తారు. సర్వీసు నిబంధనలు మారిపోతాయి. డిస్కామ్‌ల లాభ నష్టాలతో ప్రయివేటువారికి సంబంధం లేకుండా ఇకపై కొత్తగా లావాదేవీలు ప్రారంభిస్తారని కేంద్రం స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ అంతా 8 నెలల్లో (32 వారాలు) పూర్తి చేయాలని, వారాల వారీగా వివిధ దశలకు గడువులు నిర్దేశించడం కార్పొరేట్లకు పూర్తిగా లొంగిపోవడమే.

విద్యుత్ సరఫరాకు అయ్యే ఖర్చు (కాస్ట్ టు సర్వ్)ను వినియోగదార్ల నుండి వసూలు చేయాలని, సబ్సిడీలుండవనీ కేంద్రం పేర్కొంది. అన్ని విధాలా ప్రయివేటు వారికి లబ్ది చేకూర్చే నిబంధనలు పెట్టింది. బ్రిటీష్ పాలనా కాలం నుండి ప్రజల సంపదగా వృద్ధి చెందిన విద్యుత్ రంగం ప్రయివేటు ఆస్తిగా మారిపోవడమేగాక జనం విపరీత దోపిడీకి గురవుతారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో సహా వివిధ తరగతులకు ఇస్తున్న రాయితీలు అందకుండా పోతాయి. ప్రభుత్వరంగంలో ఉన్న ఉద్యోగులు ప్రయివేటువారి దయాదాక్షిణ్యాలకు వదిలేయబడతారు.

అన్ని తరగతుల వారికి హానికరమైన ఈ విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. అలాగే వివిధ తరగతుల ప్రజలు, విద్యుత్ రంగ నిపుణులు, మేధావులు కూడా ఈ సంస్కరణలను తిరస్కరించాలని కోరుతున్నాము. ఇప్పటికే తెలంగాణా అసెంబ్లీ కేంద్ర విద్యుత్ చట్టాన్ని వ్యతిరకిస్తూ తీర్మానం చేసింది. అదే విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కు తగ్గకపోతే విశాల ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి